ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : జి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 సంచిక : 6 ఫిబ్రవరి 2022

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

నారాయణ గాయత్రి.................................................. 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 3


భగవద్గీత - శ్లోకం 2-45 ........................................ 21

అక్షరమణమాల ........................................................ 23

ఇతర విషయములు :

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



కాలం మన కోసం ఆగదు. ఉన్న కాలాన్ని ఎవడైతే సద్వినియోగం చేసుకొంటున్నాడో వాడిని వివేకవంతుడు అంటారు. తెలివైన వాడికి తెలివితక్కువ వాడికి తేడా ఏమిటి అంటే, తెలివితక్కువ వాడికి కూడా అవకాశం వస్తుంది కానీ ఆ అవకాశాన్ని వదిలేస్తాడు. తెలివైన వాడు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడు.

# నారాయణ గాయత్రి

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ పలుకులలో నారాయణ గాయత్రి అర్థం)**

**ఓం నారాయణాయ విద్మహే వాసుదేవాయ దీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్!**

నారాయణుని తెలుసుకొనుటకు వాసుదేవుడిని ధ్యానము చేయవలెను.

**ఓం నారాయణాయ విద్మహే వాసుదేవాయ దీమహి** - నారాయణుడు అంటే అందరి హృదయములలో అంతర్యామిగా ఉన్న వాడు. రాగద్వేషములు లేనివాడు భగవంతుని స్వరూపం పొందుతాడు కాబట్టి వాడిని భగవాన్ అని పిలుస్తారు. వాసుదేవుడిని ధ్యానం చేస్తే నారాయణుడు తెలియబడతాడు. వేదం ఇది.

**తన్నో** - (పూర్వం రాసినవాళ్లది ఎంత విశాల హృదయమో చూడండి.) నాకు అనలేదు. తన్నో అంటే మన అందరికీ.

**తన్నో విష్ణుః ప్రచోదయాత్** - విష్ణువు అన్నా, వాసుదేవుడు అన్నా, నారాయణుడు అన్నా ఒకటే. నారాయణస్వరూపాన్ని తెలుసుకోవటానికి, వాసుదేవుడిని మనం ధ్యానం చెయ్యమంటే చేస్తామా చెయ్యము! అటువంటి ధ్యానము చేసే బుద్ధిని వాసుదేవుడిని స్మరించే బుద్ధిని మాకు అందరికీ ప్రసాదించు అని విష్ణుదేవుడిని ప్రార్థిస్తున్నాను. అది దీని అర్థము.

మాకు అందరికీ విష్ణు భగవానుడుఅటువంటి మంచి బుద్ధిని అనుగ్రహించు గాక! అంటే వాసుదేవుడిని ధ్యానం చేసే బుద్ధిని లోపల అంతర్యామిగా ఉన్న మహావిష్ణువు మాకు కలగజేస్తే మేము వాసుదేవుడిని ధ్యానం చేస్తాము. ధ్యానం చేయగా చేయగా, స్మరించగా స్మరించగా, ఆయన నామం చేయగా చేయగా, నారాయణ స్వరూపం మాకు తెలియ బడుతుంది. అంటే ఆత్మ స్వరూపం చైతన్య స్వరూపం మాకు తెలియబడుతుంది అనిఅర్థం

నారాయణుడు కాల స్వరూపంలో ఉన్నాడు. మనకి చనిపోయే రోజు వస్తే సాధన చేయలేము. అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**ఓం నారాయణాయ విద్మహే వాసుదేవాయ దీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్!**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 30 నవంబరు 1983, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను మీకు ఉదాత్తమైన భవిష్యత్తు, ఉజ్వలమైన భవిష్యత్తు కలుగజేయమని నిండు మనసుతో భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మీ శ్రేయస్సులోనే నా శ్రేయస్సు ఉంది, మీ క్షేమంలోనే నా క్షేమం కూడా ఉంది. మీ సంతోషం, నా సంతోషం. మీ దుఃఖం, నా దుఃఖం. మీరు ఒక గంట సేపు మౌనంలో కూడా చాలా ప్రశాంతంగా కూర్చుని ఈ సమావేశానికి ఎంతో ఉన్నత స్థాయిని తీసుకు వస్తున్నారు. మన ఈ ప్రసంగం కంటే మౌనం చాలా ముఖ్యమైనది. ఆదిగురువు దక్షిణామూర్తి కూడా భగవంతుడి స్వరూపాన్ని మాటల తోటి చెప్పలేక మౌనం తోటి చెప్పాడు. జ్ఞానికి కూడా మాటల తోటి చెప్పడం సాధ్యం కాదు. అందుచేత ఆదిగురువు దక్షిణామూర్తి మౌనంగానే బోధించాడు. మౌనం కూడా బోధే. మౌనం మీరు బాధ అనుకోకండి అందులో బోధ ఉంది.

మీ శరీరం తోటి నాలుగు గంటలు పూజ చెయ్యడం కంటే, నాలుగు నిమిషాలు ఆత్మ గురించి వినటం మంచిది. పూజకి ఫలితం లేదు అని నేను అనటం లేదు, శరీరం తోటి చేసే పూజకి ఫలితం ఉంది. నోటి తోటి చేసే జపానికి ఫలితం ఉంది. మనసు తోటి చేసే ధ్యానానికి ఫలితం ఉంది. ఇది భగవంతుడి యొక్క ఆజ్ఞ. మీ శరీరం తోటి చేసే పూజ కంటే కూడా ఇలా ఒక ఐదు నిమిషాలు ఈ మాటలు వినటం వల్ల దానికంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. మీరు చేసే పూజ కంటే కూడా ఎక్కువ ప్రయోజనం, ఫలితాన్ని మీరు పొందుతారు. దైవానుగ్రహం బాహ్యంగా, బహిరంగంగా వచ్చేది కాదు. ఆ దైవానుగ్రహం మీకు కలిగినప్పుడు, మీ హృదయంలో ప్రవేశించినప్పుడు అనుగ్రహం ఎలా ఉంటుందో మీ హృదయానికి తెలుస్తుంది. అది మటుకి ఎవరికి జరిగినా రహస్యంగానే జరుగుతుంది.

ఎవరైనా జ్ఞాని అయ్యారు అంటే దైవానుగ్రహం వల్ల అయ్యారు. అయితే ఆ అనుగ్రహం ఎప్పుడు వచ్చింది? ఎక్కడ వచ్చింది? ఎలా వచ్చింది? అని అతను కూడా చెప్పలేడు. భగవంతుడి తోటి మీరు మానసిక సంబంధం పెట్టుకోవటం వల్ల ఎక్కువ ప్రయోజనాలు పొందుతారు. ఎక్కువ మేలును పొందుతారు. భగవంతుడిని స్మరించడం వల్ల ఏమిటి

ప్రయోజనం అని మీరు అనుకోవచ్చును. దాని వలన హృదయం విశాలం అవుతుంది, మనస్సు నిర్మలం అవుతుంది, బుద్ధి సూక్ష్మం అవుతుంది. భగవంతుడిని స్మరించడం వల్ల ఈ ప్రయోజనాలు అన్నీ వస్తాయి. దైవాన్ని ప్రార్థించటం వల్ల, హృదయంలో మీరు భగవంతుడితో సంబంధం పెట్టుకోవడం వల్ల అతి కష్టమైనా విషయం కూడా, సూక్ష్మాతి సూక్ష్మ విషయం కూడా, క్లిష్టమైన సమస్య కూడా మీకు తేటతెల్లంగా అర్థం అవుతుంది. వినడం కంటే విషయాన్ని అర్థం చేసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం మీరు పొందుతారు. ఒకటి సత్యం, రెండు సహనం. ఈ దేవుడు గొప్పవాడా, ఆ దేవుడు గొప్పవాడా అని లోకంలో గొడవలు కాదు. సత్యానికంటే గొప్ప మతం లేదు, సత్యానికంటే గొప్ప దేవుడు లేడు. ఏ మతం కూడా సత్యానికంటే గొప్ప మతం కాదు, ఏ దేవుడు కూడా సత్యానికంటే గొప్ప దేవుడు కాదు. అందరి దేవుళ్ళ కంటే సత్యం గొప్పది, అన్ని మతాల కంటే, అన్ని కులాల కంటే, అన్ని వర్ణాల కంటే సత్యం గొప్పది. అయితే ఏది సత్యం? ఆత్మ ఒక్కటే సత్యం. సత్యమనేది ఒక్కటే, మనిషికి హృదయం ఒక్కటే, సత్యమనేది ఒక్కటే.

ఏ మనిషిలోను రెండు హృదయాలు లేవు. ఇక్కడ కూర్చున్న మనుషుల్లో ఎవరికైనా రెండు హృదయాలు ఉన్నాయా? అందరికీ ఒకే శరీరం ఉంది. అదే విధంగా ఒకే హృదయం కూడా ఉంది. ఉన్నది ఒకే హృదయం. మీ హృదయంలో ఈశ్వరుడి కన్నా చోటు ఇవ్వాలి, లోకానికి అయినా చోటు ఇవ్వాలి, లోకానికి చోటు ఇచ్చిన మీ హృదయంలో ఈశ్వరుడికి చోటు ఎక్కడ ఉంది? లోకానికి చోటు ఇచ్చారు. లోకాన్ని అందులోంచి మీరు బయటకి లాగలేరు. బయటకి లాగకపోతే ఒకే హృదయంలో ఈశ్వరుడిని, లోకాన్ని ఎలా ఇరుకుగా కూర్చోబెట్టగలరు? మన అందరికీ తలొక శరీరం ఉంది, అదే విధంగా లోపల అందరికీ తలొక హృదయం ఉంది. మీ హృదయంలోఎవరైనా ఈశ్వరుడికి స్థానం ఇచ్చారా? పైకి ఏమి చెప్పవద్దు. మీ హృదయాలలో పరిశీలించి చూసుకోండి, మీకు తెలుస్తుంది. మీ హృదయంలో వెతుక్కోండి. అందులో ఏముంది? లోకం ఉంది. లోపల ఈశ్వరుడు ఎక్కడైనా ఉన్నాడా అంటే లేడు. హృదయంలో లోకం ఉంది కాబట్టి, లోకంలోకి వస్తున్నారు. ఇదికామన్ సెన్స్. దీనికోసం పుస్తకాలు చదవక్కరలేదు, బుర్రలు బద్దలు కొట్టుకోవక్కర్లేదు, మీరు ఈ చిన్న విషయాన్ని అర్థం చేసుకోండి ఇంక పాండిత్యం అక్కర్లేదు.

మీకు రెండు హృదయాలు ఉంటే ఒక హృదయంలో ఈశ్వరుడికి స్థానం ఇస్తే,

రెండో హృదయంలో లోకానికి స్థానం ఇద్దరు గాని, కానీ ఉన్నది ఒక్కటే! ఇది ప్రత్యక్ష ప్రమాణం. ఈ శరీరం మనది అని అనుకుంటున్నాం. నిజంగా మనది అయితే మనల్ని విడిచి పెట్టి ఇది ఎందుకు వెళ్ళిపోవాలి? చివరకు ఈ శరీరం బూడిద అవుతుంది. నువ్వు ఎవరు అంటే, నేను బూడిద అని చెప్పాలి. మీరు అయ్యేది బూడిద కాబట్టి. మరి మనిషి బూడిదా? లేకపోతే ఆత్మా?

వచ్చిన దేహం పడిపోవటం చూస్తున్నాం. మన ఎదురుగా మన కళ్ళతోటిచూస్తుంటే అనేక దేహాలు పడిపోతున్నాయి. ఆ దేహాలు పడిపోయినపుడు మన మనసులు అన్నీ ఎందుకు రాలిపోవటం లేదు? దేహం రాలిపోయినపుడు మన మనసులో ఉన్న సంస్కారాలు కానీ, వాంఛలు కానీ, ఆదర్శాలు కానీ, ఆశయాలు కానీ ఎందుకు రాలిపోవడం లేదు? మనం నేను నేను అంటున్నాం, మనం అనే నేనుకి, ఈ దేహానికి ఎట్టి సంబంధం లేదు. సహనం ఉన్నవాడు ఈ లోకాన్ని జయిస్తాడు. ఎందుకు ఈ లోకాన్ని జయించాలి. ఈ లోకాన్ని జయించకపోతే ఆత్మ తెలియదు కాబట్టి. ఉపనిషత్తులలో ఏమని చెప్పారు అంటే నీ కుటుంబం కోసం నీ స్వార్థం విడిచి పెట్టు, నీ గ్రామం కోసం నీ కుటుంబం యొక్క స్వార్థాన్ని విడిచి పెట్టు, నీ రాష్ట్రం కోసం నీ గ్రామం యొక్క స్వార్థం విడిచి పెట్టు, నీ దేశం కోసం నీ రాష్ట్రం యొక్క స్వార్థం విడిచి పెట్టు, ప్రపంచం కోసం నీ దేశం మీద నీకున్న ప్రేమని విడిచి పెట్టు, ఆత్మ కోసం ప్రపంచం అంతా విడిచి పెట్టు అని చెప్పారు. కనీసం కుటుంబం కోసం నా స్వార్థం నేను విడిచి పెట్టను. మనం దేశం దాకా వెళ్ళద్దు, ప్రపంచం దాకా వెళ్ళద్దు, ఆత్మ దాకా వెళ్ళద్దు. కనీసం నా కుటుంబం కోసం కూడా నా స్వార్థాన్ని నేను బలి చేయలేను. అందుచేత లోకాన్ని జయించాలి, లోకాన్ని జయిస్తేనే కానీ, ఆత్మ దర్శనం



**కారుకి డ్రైవరు ఎటువంటి వాడో, మన శరీరానికి మన బుద్ధి డ్రైవరు లాంటివాడు. డ్రైవరుని బట్టే కారు తోలటం జరుగుతుంది. అలాగే మన బుద్ధిని బట్టే మన శరీరం నడుస్తూ ఉంటుంది.**

కాదు. అయితే ఎవడు జయిస్తాడు ఈ లోకాన్ని అంటే ఆచార్యస్వామి వారు చెపుతున్నారు ఎవడికైతే సత్యనిష్ఠ ఉందో, ఎవడికైతే సహనం ఉందో వాడు ఈ లోకాన్ని జయిస్తాడు. చివరిరోజు వరకు, చివరిశ్వాస వరకు, అంతిమగడియలు వరకు, ఎవడైతే సత్యాన్ని విడిచి పెట్టడో, ఎవడైతే సహనాన్ని విడిచిపెట్టడో, వాడినే సత్యం వరిస్తుంది, సహనం వరిస్తుంది. మనం ఎన్నో విషయాల గురించి ఆలోచిస్తాం. కానీ మన మెదడులో ఉన్న దోషాలు గురించి ఆలోచించము. ఇదే మాయ. దేహం రాలిపోయినపుడు ఇందులో ఒక్క దోషం కూడా రాలదు. మీరు అర్థం చేసుకునేటప్పుడు స్పష్టత ఉండాలి. సూటిగా, సరళంగా మీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. విషయాన్ని కలగా పులగం చెయ్యకండి, కంగారు పడకండి.

సత్యనిష్ఠ ఉన్నవాడు లోకాన్ని జయిస్తాడు అని ఆచార్యులవారు చెబుతున్నారు. ఎవడికైతే సహననిష్ట ఉందో, ఎవడికైతే సత్యనిష్ట ఉందో, వాడు లోకాన్ని జయిస్తాడు అని చెప్పటం కంటే వాడి హృదయం నుంచి లోకం జారిపోతుంది. లోకాన్ని జయిస్తాడు అని ఆచార్యులవారు అంటున్నారు. లోకాన్ని జయిస్తాడు అని చెప్పటం కంటే వాడి హృదయం లోంచి లోకం జారిపోతుంది. సత్యనిష్ట ఉన్నవాడికి జయించడానికి అంటూ అక్కడ ఏమీ లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు అది తానై ఉన్నాడు ఇంక జయించడానికి ఏముంది అక్కడ! ఎన్ని దేహాలలో తిరిగినా, ఎక్కడకి తిరిగినా, ఎన్ని లోకాలు తిరిగినా, ఎన్ని నదుల్లో స్నానం చేసినా చివరి జన్మలోమీరు అందరూ ఆత్మ దగ్గరకు రావల్సిందే. దేవుడు సత్యం, దేవుడు సత్యం అని చెప్పడం కంటే సత్యాన్నే దేవుడు అని చెప్పటం మంచిది. ఇది ఇంకా బాగుంటుంది, ఇది నా అభిప్రాయం అని జాతిపిత గాంధీజీ చెప్పారు.

హృదయానికి నచ్చింది, మీ మనసు మెచ్చింది, ఏదో ఒక విషయాన్ని మీరు తీసుకోండి, ఒక ఆదర్శాన్ని తీసుకోండి, మీకు నచ్చిన ఒక్క మంచిగుణాన్ని తీసుకోండి. మొత్తం అన్ని మంచిగుణాలు వద్దు మీకు నచ్చిన మంచిగుణం ఒక్క మంచిగుణాన్ని తీసుకోండి. దాని కోసం జీవించండి, దాని కోసం మరణించండి. అప్పుడు మీరు ఎక్కడున్నారో సత్యమే వెతుక్కుంటూ వస్తుంది మీ దగ్గరకి, ఒక్క మంచిగుణం అయినా సరే చాలు, దానికోసం జీవించండి. దానికి మించిన సాధన అంటూ ఏమీ లేదు. చిన్న పని అనిపనిలో విభాగం

పెట్టుకోవక్కర్లేదు. పెద్ద పని, చిన్న పని ఇదంతా మనసు యొక్క కల్పన. రైలు ఇంజను కనుక పెట్టెల తోటి కలవకపోతే ఆ పెట్టెలు ఏ విధంగా అయితే కదలవో, దైవానుగ్రహం వచ్చి మన శిరస్సు మీద పడకపోతే మన హృదయంలో ప్రవేశించకపోతే, మన జీవితంలో పరిణామం లేదు, ప్రగతి లేదు, భవిషత్తు లేదు, మోక్షం లేదు.

మీరు శరణాగతి పొందిన రోజున, సహనంగా జీవిస్తున్న రోజున మీకు తెలియకుండానే దైవానుగ్రహం మీలో ప్రవేశిస్తుంది. అది ఎలా ప్రవేశించిందో తరువాత మిమ్మల్ని అడిగినా మీరు చెప్పలేరు. దైవానుగ్రహం వచ్చిన రోజున దానికి మీకు రహస్యమైన సంబంధం, విడదీయరాని సంబంధం, తెంపడానికి వీలులేని సంబంధం ఏర్పడుతుంది. అనుగ్రహం మిమ్మల్ని తీసుకెళ్ళి మీ చేత ఆత్మదర్శనం చేయిస్తుంది. అక్కడ మీ సాధన తోటి, మీ వృత్తుల తోటి, మీ జపాల తోటి, మీ పూజల తోటి పని లేదు. ఈ జపాలు, పూజలు అవసరమే, కాని ఇవి పైపైన చేసే పనులు. ఎవడికైతే దయ గల హృదయం ఉందో, వాడికి దేవతలు కూడా నమస్కరిస్తారు. దయగల హృదయం ఎలా ఉంటుందో మనం ఎప్పుడైనా దానిని చూసి వచ్చామా? కొంతమంది మానవరూపంలో ఉన్నప్పటికీ పశు లక్షణాలు ఉంటాయి. శరీరం ఉండటం మానవశరీరం ఉంటుంది. కానీ లక్షణాలు అన్నీ పశు లక్షణాలు ఉంటాయి. దైవం అంటే ఎలా ఉంటుందో, దయ అంటే ఎలా ఉంటుందో, ఏమీ తెలియ కుండానే చాలా శరీరాలు రాలిపోతాయి.

దయగల హృదయం కలవాడు మహాత్ముడు. దయగల హృదయం లేనివాడు మహాత్ముడు కాదు దురాత్ముడు. భగవంతుడికి మీరు గుడి కడుతున్నారు. మీరు కట్టే గుడి నిజం కాదు. ఇటుకల తోటి, సిమెంటు తోటి కట్టే గుడులు బయటి గుడులు. కానీ దయగల హృదయంలో ఈశ్వరుడే గుడి కట్టుకుని అక్కడ కాపురం ఉంటాడు. మీ హృదయంలో దయ ఉంటే, దానికి ఇటుకల తోటి పనిలేదు, సిమెంటు తోటి పనిలేదు, ఆయన దయ చాలు. మన అందరికీ నలభై సంవత్సరాలు, యాభై సంవత్సరాలు, అరవై సంవత్సరాలు, డభ్బై సంవత్సరాలు వచ్చాయి. ఒక్కసారి వెనక్కి తిరిగి మీ జీవితాన్ని నెమరు వేసుకోండి, మనం జీవించిన జీవితంలో, ఒక్కసారి ఎప్పుడైనా బీదవాడిని చూసి మన హృదయం ద్రవించిన సంఘటన ఒక్క సంఘటన మీరు జ్ఞాపకం తెచ్చుకోండి, కనీసం ఒక్క సంఘటన అయినా మీ జీవితంలోఉందా? కనీసం ఒక్క సంఘటన. ఒక్కసారి మీ మనస్సుని వెనక్కి తిప్పకోండి,

ఇంతకాలం జీవించాం మన హృదయంలోఎప్పుడైనా దయ అనేది కలిగిందా? ఏ సందర్భంలో అయినా, ఎప్పుడైనా, ఎక్కడైనా కలిగిందా? ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోండి. బీద ప్రజలని చూసి, దిక్కులేని వాళ్ళని చూసి, ఎవడి హృదయం అయితే ద్రవిస్తుందో, వాళ్ళు ఈ లోకంలో మహాత్ములు అని స్వామీజీ చెప్పారు. ఇరుకైన హృదయాలలోకి ఈశ్వరుడు ప్రవేశించడు. కొంతమంది మనసులు చాలా ఇరుకుగా ఉంటాయి. కొంతమంది హృదయాలు అంతే చాలా ఇరుకుగా ఉంటాయి. ఇరుకైన జీవితాలలోకి ఈశ్వరుడు రావడానికి ఎట్టి పరిస్థితులలోను అవకాశం లేదు. ఈనాటికైనా, వచ్చే నాటికైనా, ఈ జన్మకైనా, వచ్చే జన్మకైనా, అవకాశం లేదు, కనపడదు. మన మనసులో ఉన్న ఇరుకు పోవడానికి, మన హృదయంలో ఉన్న ఇరుకు పోవడానికే ప్రార్థనలు పెట్టారు, పూజ అందుకే పెట్టారు, జపం కూడా అందుకే. దయగల హృదయంలోనే భగవంతుడు కాపురం ఉంటాడు. భగవంతుడి ఇల్లు ఎక్కడ అంటే? దయగల హృదయమే భగవంతుడి యొక్క ఇల్లు.

ఒక మహాత్ముడు గురించి నాన్నగారు చెప్పిన మాటలు “ఆయన పూర్వ జన్మల్లో ఎంత సాధన చేసి వచ్చాడో, కొంతకాలం కాలేజి ప్రిన్సిపాల్ చేశాడు అతను. వాళ్ళ అమ్మ చిన్నప్పుడు కొనుక్కోమని డబ్బులు ఇచ్చేది హైస్కూల్‌కి వెళ్ళేటప్పుడు, ఆ డబ్బులు జేబులో పెట్టుకుని బళ్లోకి వచ్చేటప్పుడు చిన్న చిన్న చేపలు పట్టుకున్న వాళ్ళు ఎవరైనా కనిపిస్తే ఆ చేపలు బేరం ఆడేవాడు. ఈయన దగ్గర ఎన్ని డబ్బులు ఉంటే అన్ని డబ్బులు పెట్టి చేపలు కొనేవాడు. కొని ఆ చేపలు పట్టుకెళ్ళి చెరువులో వేసేవాడు. ఏ కాలేజీలో నేర్చుకున్నాడు? ఏ హైస్కూల్‌లో నేర్చుకున్నాడు? ఏ యూనివర్సిటీలో నేర్చుకున్నాడు ఇవన్నీ!” వాడికి పుట్టుక తోటి వచ్చింది ఆ దయగల హృదయం. నేను ఏమికట్టుకుంటున్నానో, నేను ఏమితింటున్నానో దాని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. హృదయంలో సంస్కారం లేకుండా, హృదయంలో సున్నితత్వం లేకుండా, ఈశ్వరుడు ఆవిష్కరించబడడు. మనం ఇంటిలో ఉన్న దుమ్ము దులుపుకుంటున్నాం, కానీ మన మనసులో ఉన్న దుమ్ము దులుపుకోము. ఇంటిలోని దుమ్ముని చూస్తే ఈ దుమ్ము ఏమిటి ఇలా ఉందని మనకు కంగారు వస్తుంది, కానీ మనసులో ఉన్న దుమ్ము గురించి మనం భయపడము. ఆ దుమ్ము దులుపుకోవడానికి ప్రయత్నం చెయ్యము. శరీరానికి ఇచ్చిన ప్రాముఖ్యత కూడా మనసుని బాగు చేసుకోవడానికి ప్రాముఖ్యత ఇవ్వటం లేదు.

జ్ఞాన యోగం, కర్మ యోగం ఈ యోగాల వల్ల ప్రయోజనం ఏమిటి? ఈ యోగం వల్ల శక్తి వస్తుంది, శక్తి వల్ల మనస్సులో ఉన్న దుమ్ము పోతుంది. శక్తి లేకపోతే జ్ఞానం రాదు, జ్ఞానం లేకపోతే ప్రకాశం లేదు, జ్ఞానం తోటి మనకి శాంతి ఆవిష్కరింపబడుతుంది. సంసారంలో ఉన్న దోషాలు వివేకవంతుడు చూస్తూ ఉంటాడు, అంతేకాదు ఆ దోషాలు నుంచి బయట పడడానికి ప్రయత్నం చేస్తాడు. వివేకం లేనివాడు దోషాల నుండి వాడు బయట పడక్కర్లేదు, కనీసం దోషంలో ఉన్నాం అన్న సంగతి కూడా వాడికి తెలియకుండా వాడి జీవితం రాలిపోతుంది. మనం ఇక్కడ చెప్పకొనే మాటలు ఇక్కడ స్తంభం కూడా వింటుంది. ఈ స్తంభం ఎంత అభివృద్ధి అవుతుందో కొంతమంది మనుషులు అంతే అభివృద్ధి అవుతారు. కొంతమంది మనుషులు కూడా స్తంభాల లాగే ఉంటారు. వారు వింటున్నారా అంటే వింటున్నారు. మరి ఏమి పరిణామం వచ్చింది అంటే ఎంత వికాసం పొందారు అంటే ఏమీ ఉండదు. మీరు నిజం చెబుతున్నారు అనుకోండి, మీరు నిజం చెబుతున్నప్పటికీ అది హితవుగా ఉండాలి, ప్రీతిగా ఉండాలి, స్వీట్‌గా ఉండాలి, అది అందంగా చెప్పాలి. నిజం చెబుతున్నాం కదా అని నోటికి వచ్చినట్టు చెప్పకూడదు. కొంతమంది నిజం చెబుతున్నాం అని recklessగా చెబుతారు. ఒక క్రమబద్ధం లేకుండా చెబుతారు. క్రమశిక్షణ లేకుండా చెబుతారు, నిజం చెబితే చాలదు. నిజాన్ని ప్రీతిగా చెప్పాలి, హితవుగా చెప్పాలి, ఎదుటి వాడికి అర్థం అయ్యేలా చెప్పాలి. నేను నిజమే చెబుతాను అండి. నేను అబద్ధాలు చెప్పను అని చాలామంది అంటారు. అదోరకమైన అహంకారం. అది ప్రధానం కాదు. మీరు చెప్పేది క్రమపద్ధతిగా, క్రమశిక్షణతో చెప్పాలి.

డాక్టర్లు మత్తు మందు పెడతారు. ఎందుకు పెడతారు మత్తుమందు? బాధ



**మనకు సొంతమంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు.**
**అది భగవంతుడు ఇస్తేనే మనకు వస్తుంది, లేకపోతే రాదు.**
**కానీ భగవంతుడు ఇచ్చింది ఆయన ఇచ్చాడు అనుకోకుండా**
**అది మన సొంతం అని మనకు అనిపిస్తోంది. భగవంతుడు**
**మీకు ఏమి ఇచ్చినా అది మీ సొంతం అనుకోవద్దు.**
**అది భగవంతుడు ఇచ్చిన గిఫ్టు అనుకోండి.**

తెలియకుండా ఉండటం కోసం, మీరు చెప్పే విషయం కూడా ఎదుటివాడికి బాధ కలుగజేయకూడదు, వాడు బాగుపడాలి, వాడికి సలహా రూపంలో చెప్పాలి. వాడికి హితవుగా చెప్పాలి. రమ్యంగా చెప్పాలి, వాడి హృదయానికి హత్తుకునేలా చెప్పాలి. మాటలు మనుషులని దూరం చేసేస్తాయి. మాటలు కూడా అగ్గి పుల్లలు వంటివి. అగ్గిపుల్ల తోటి మనం ఇంటికి నిప్పు పెట్టుకోవచ్చు, పొయ్యిలో నిప్పులు వేసుకుని అన్నం వండుకోవచ్చు. మాటలు కూడా అటువంటివే. మాటల వల్ల కాలిపోయిన సంసారాలు ఉన్నాయి. మాటలు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. ఆలోచించి మాట్లాడాలి. అందుకే పూర్వం నుంచి మన పెద్దలు చెబుతారు “కాలు జారితే తీసుకోవచ్చు కానీ మాట జారితే తీసుకోలేము”.

మన హృదయంలో ఉన్న లోపం ఏమిటి అంటే, బలహీనత ఏమిటి అంటే ముందు మాట్లాడుతాం, తర్వాత ఆలోచిస్తాం. కానీ మన పెద్దలు ఏమని చెప్పారు అంటే ముందు ఆలోచించండి, తరువాత మాట్లాడండి. నిజం చెబుతున్నాం కాబట్టి మీ ఇష్టం వచ్చినట్టు చెప్పకూడదు అని చెబుతున్నాడు ఇక్కడ శాస్త్రంలో, అది హితవుగా చెప్పమన్నాడు. ఎదుటివాడికి నొప్పి పుట్టకుండా చెప్పమన్నాడు. వాడు బాగుపడే రీతిలో చెప్పమన్నాడు. కొంతమంది స్మృతులను మనం మర్చిపోలేము. అలాగే కొంతమంది జీవితాలని కూడా మర్చిపోలేము. ఇవాళ భగవాన్ ఎక్కడవాడు? ఎక్కడో కొండ మీద కూర్చునేవాడు ఆయన చెప్పిన మాటలు నదులు దాటాయి, ఊళ్ళు దాటాయి, సముద్రాలు దాటాయి. ఖండాలు దాటాయి, దేశాలు దాటాయి. మరి మన మాటలు జిన్నూరు దాటి ఎక్కడకి వెళ్ళడం లేదు. మరి మాటకి శక్తి లేకపోతే భగవాన్ మాటలు కానీ, అరవిందుడు మాటలు కానీ దేశాలు దాటి, సముద్రాలు దాటి ఎంత దూరం ప్రయాణం చేశాయి. మరి మన మాట ఎక్కడకీ కదలడం లేదే. ఇంజను తగిలించని పెట్టెలులా ఉన్నాయి మన మాటలు.

మీ శరీరానికి ఏ విధంగా అయితే శక్తి ఉందో, మీ సంకల్పానికి శక్తి ఉంది, మీ మాటకి శక్తి ఉంది, మీ భావనకి శక్తి ఉంది, మీ తలంపుకి శక్తి ఉంది, మీ ఊహలకి శక్తి ఉంది, మీ ఆలోచనకి శక్తి ఉంది, మీ ఆదర్శానికి శక్తి ఉంది. ఏదో ఒక ఆదర్శం కోసం జీవించని మనుషుల తోటి మనకి సహవాసం పనికిరాదు. వాళ్ళు ఎంతదగ్గర వాళ్ళు అయినా సరే, ఎంత సన్నిహితులు అయినా సరే, ఎంత స్నేహితులు అయినా సరే సాధ్యమైనంతవరకు దూరంగాఉండటం మంచిది. ఎండ్రిన్ ఇంట్లో ఉంది, అది మన సొంతమే, మన సొంతం

అని నోట్లో వేసుకుంటామా? అయితే మనకి ఎంత దగ్గర వాళ్ళు అయినా సరే వాళ్లకి క్రమశిక్షణ లేకపోతే మనం వారికి దూరంగా ఉండవలసిందే. ఎందుకంటే మనలో ఉన్న నిజమైన ఆత్మను తెలుసుకోవడానికి వారు అడ్డు వస్తారు.

పూర్వం అనేకసార్లు చెప్పాను మరొకసారి, మరొకసారి, మరొకసారి నేను చెబుతున్నాను. ధైర్యం లేనివాడికి ఆత్మ దర్శనం అవ్వదు. అసలు ఆత్మ గురించి చెప్పడం కంటే మనిషికి ధైర్యం గురించి ఎక్కువ చెప్పటం మంచిదేమో అని నాకు అనిపిస్తుంది. ధైర్యం లేనివాడు స్వతంత్రంగా జీవించలేడు. ధైర్యం లేనివాడు ఆనందంగా మరణించలేడు. శాంతిగా మరణించలేడు, సంతోషంగా మరణించలేడు. ధైర్యం లేనివాడికి ఆత్మ దర్శనం కాదు. మీ అంతట మీరు ధైర్యంగా ఉండండి, మిమ్మల్ని చూసి నేను నేర్చుకుంటాను. పిరికివాడు స్వతంత్ర్యంగా జీవించలేడు వాడు పారమార్థిక జీవితానికి అసలే పనికిరాడు. అన్ని రోగాలకి ఒక్కటే మందు, అది ధైర్యం అని భీష్మాచార్యుల వారు చెప్పారు. ధైర్యానికి మించిన మందు లేదని భీష్ముడు చెప్పాడు. మనలో ఉన్న బలహీనతలు అన్నిటికీ భయం కారణం, మనలో ఉన్న రోగాలు అన్నిటికీ భయం కారణం. మనం చచ్చిపోవడానికి భయం కారణం, మనం పుట్టడానికి భయం కారణం. మనలోని లోటు పాటులు అన్నిటికీ భయం కారణం. జీవితంలో అన్నిటికీ భయం కారణం. అందుచేత ధైర్యంగా ఉండండి.

మీరు పుణ్యం చేసినా శరీరం తోటే చెయ్యాలి, మాట తోటి చెయ్యాలి, మనస్సు తోటి చెయ్యాలి. పాపం చేసినా శరీరం తోటి చెయ్యాలి, మాట తోటి చెయ్యాలి, మనసుతోటి చెయ్యాలి. పాపం చేసినా ఈ శరీరమే, ఈ మాటే, ఈ మనస్సే. పుణ్యం చేసినా ఈ శరీరమే, ఈ మాటే, ఈ మనస్సే. ఈ మూడే పాపం చేస్తున్నాయి, ఇవి మూడే పుణ్యం చేస్తున్నాయి. మనకి పుణ్యం తెచ్చిపెట్టినా ఇవే, మనకి పాపం తెచ్చిపెట్టినా ఇవే. అందుచేత ఈ మూడింటినీ ఎవడైతే ఈశ్వరుడికి అర్పించాడో వాడే జ్ఞాని. మీకు అందరికీ శరీరం ఉంది, మీకు మాట ఉంది, మీకు మనసు ఉంది. ఎవడైతే ఈ మూడింటినీ ఈశ్వరుడికి సమర్పిస్తున్నాడో వాడే జ్ఞాని అవుతాడు. మీరు పుణ్యం సంపాదించుకోవాలి అన్నా మీ శరీరాన్ని, మీ మనసుని, మీ వాక్కుని ఉపయోగించుకోవాల్సిందే. అనవసరమైన మాటలు మాట్లాడి కొంతమంది పాపం తెచ్చుకుంటారు.

ఏదైనా ఒక విషయం గురించి మనం మాట్లాడేటప్పుడు అవసరమైన దానికంటే ఎక్కువ చెప్పకూడదు. అవసరమైనదానికంటే తక్కువ చెప్పకూడదు. అది వివేకవంతుల లక్షణం. ఎక్కువ మాటలు చెప్పటం వల్ల కూడా కొన్ని పాపాలు వస్తాయి. కొంతమంది అతిశయోక్తిగా చెబుతారు. జరిగింది చిన్న విషయం. దానిని పెద్దది చేసి, పెద్దది చేసి అతిశయోక్తిగా ప్రచారం చేస్తారు. దానివలన వాడు పాపం పోగుచేసుకుంటున్నాడు అని, పాపం మూట కట్టుకుంటున్నాడు అని వాడికి తెలియదు. మనం శరీరంతో చేసే పని వల్ల పుణ్యం వస్తుంది, పాపం వస్తుంది. మన మనసుతో చేసే ఊహల ద్వారా పాపం వస్తుంది, పుణ్యం వస్తుంది. ఈ శరీరాన్ని, ఈ వాక్కుని, ఈ మనసుని ఎవడైతే పవిత్రంగా ఉంచుతున్నాడో వాడే జ్ఞాని అవుతాడు. మంచి చెబుతున్నాం అనుకుంటున్నప్పటికీ దానిని హితవుగా చెప్పండి. ఎదుటివాడికి మేలు కలిగేలా చెప్పండి, ప్రీతిగా చెప్పండి, ఎదుటివాడికి నొప్పి లేకుండా చెప్పండి, వాళ్ళ మనసుకి హత్తుకునేలా చెప్పండి, నిజమే చెబుతున్నాం అని క్రమశిక్షణ లేకుండా, క్రమబద్ధం లేకుండా చెప్పకండి అని ఆచార్యుల వారు చెప్పారు.

భగవాన్ శరీరం ఇక్కడ లేదు, అయితే భగవాన్ మాటలు ఎందుకు చెప్పుకుంటున్నాం ఆ మాటలకి బరువు లేకపోతే, మాటలకి శక్తి లేకపోతే, మాటలకి విలువ లేకపోతే, ఆయన మాటలు ఎందుకు స్మరించుకుంటున్నాం? మన ఇంట్లో వాళ్ళ మాటలు స్మరించుకోవచ్చు కదా, లేకపోతే మన ఊర్లో వాళ్ళ మాటలు స్మరించుకోవచ్చు కదా! ఆయన మాటలే ఎందుకు స్మరించుకొంటున్నాము. మధ్వాచార్యుల వారు ఒక మాట చెప్పారు. భగవంతుడు లేడు, భగవంతుడు లేడు అని చెప్పే మనిషి ఎవరైనా మిమ్మల్ని తరుముకు వస్తుంటే మీరెళ్ళివాడి చేతిలో పడటం కంటే, మీరెళ్ళిపులి నోట్లో పడితే నేను సంతోషిస్తాను అన్నారు మధ్వాచార్యులు. మీరు పులి నోట్లో పడితే ఆ శరీరమే పోతుంది, ఆ జన్మే పోతుంది. వీడి చేతిలో పడితే భవిషత్తు జన్మలు నీచజన్మలు వస్తాయి. పులి నోట్లో పడితే ఆ దేహం ఒక్కటే పోతుంది ధరిద్రం వదులుతుంది. అలా కాదు వాడితో సహవాసం వల్ల భవిషత్తులో మీకు అనేకమైన నీచ జన్మలు రావడానికి ఈ స్నేహం కారణం అవుతుంది. అందుచేత వీడి చేతిలో పడటం కంటే పులి నోట్లో పడండి నేను ఎక్కువ సంతోషిస్తాను అన్నారు మధ్వాచార్యులు. ఎంత అందంగా చెప్పారో చూడండి. ఎంత ఆలోచించి చెప్పారో, ఎంత తెలివిగా చెప్పారో, మన మీద ఆయన హృదయంలోఎంత ప్రీతి ఉందో చూడండి.

మనం నేర్చుకున్న విషయాలు, మనం తెలుసుకున్న విషయాలు, మనకిచేతనైనంత మనం ఆచరణలో పెట్టలేకపోతే, దానిని పడక కుర్చీ వేదాంతం అంటారు, మెట్ట వేదాంతం అంటారు. కొంతమంది భోజనాలు చేశాక పడక కుర్చీలో కూర్చొని కాలక్షేపం కబుర్లు చెబుతుంటారు. అటువంటి వేదాంతం ఇది. ఒక స్త్రీకి గర్భం వచ్చింది, ఎన్ని నెలలు అయినా పురుడు రావడం లేదు అనుకోండి గర్భంలో ఏదో దోషం ఉందని, అదే విధంగా మనం అనేక విషయాలు తెలుసుకుంటున్నాం అనుకోండి ఒక్కటీ ఆచరణలో పెట్టలేక పోతున్నాం అనుకోండి మన మనసులో ఏదో దోషం ఉందని అర్థం! మనం ఏదైతే నమ్ముతున్నామని, ఏదైతే విశ్వసిస్తున్నామని అనుకొంటున్నామో దానిని నిజంగా నమ్మటం లేదు, నిజంగా విశ్వసించటం లేదు. మన మనస్సు నమ్ముతున్నట్టుగా, మన మనస్సు విశ్వసిస్తున్నట్టుగా నటిస్తుంది. అదే మనలో ఉన్న పెద్ద లోపం. అది కూడా నటనే. జీవితం పొడవునా నటనే.

భగవంతుడిని మనం నమ్ముతున్నాం, మనం అందరం భగవంతుడిని ప్రేమిస్తున్నాం. భగవంతుడి యందు మనకు ఆప్యాయత ఉంది అని మనం అనుకోవచ్చు, కానీ ఒక్కసారి మన హృదయాంతరాళంలో చూసుకుంటే మనకు విశ్వాసం లేదని, నమ్మిక లేదని, ఒకవేళ ఉన్నా అది చాలా అల్పమైనది, స్వల్పమైనది అని మనకి తెలుస్తుంది. కొంతమంది మనుషులకి దూరదృష్టి ఉంటుంది. దూరదృష్టి ఉన్నవాళ్ళు కంటే లోపల దృష్టి ఉన్నవాళ్ళు గొప్పవాళ్ళు. దూరదృష్టి ఉన్నవాడు ప్రాపంచికంగా జీవించడానికి గొప్ప వాడు అవ్వచ్చు, దూరదృష్టి కూడా మంచిదే. దూరదృష్టి కూడా అవసరమే. ప్రాపంచికంగా, తెలివితేటలుగా జీవించడానికి

**మన జీవితాన్ని మూడు భాగాలు చేస్తే, ఒక భాగం నిద్రకు, ఇంకో భాగం మన పొట్టని పోషించుకోవటానికి ఖర్చు అయిపోతుంది. మిగిలిన మూడవవంతు భాగం మన చేతిలో ఉంది. దానిని సద్వినియోగం చేసుకోవాలి. తెలివితక్కువ పనులు చెడ్డ పనులు మానేసి, మంచి పనులు చేస్తూ మనం బాగుపడే విధానం చూసుకోవాలి. మన స్వాధీనంలో ఉన్న కాలంలో ఎవరైనా పెద్దలు చెపుతా ఉంటే సబ్జెక్టు శ్రవణం చెయ్యాలి, లేదా మనమే చదువుకోవాలి. సత్కర్మలు చేస్తూ, సద్బుద్ధిని సహృదయాన్ని ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థిస్తూ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.**



వాళ్ళ దూరదృష్టి ఉపయోగపడవచ్చు నేను కాదు అనడం లేదు. కానీ దూరదృష్టి కంటే లోపల దృష్టి ఉన్నవాడు గొప్పవాడు. ఎందుచేత అంటే లోపల దృష్టి ఉన్నవాడికి ఆత్మ దర్శనం అవుతుంది కానీ, కేవలం దూరదృష్టి ఉండటం వల్ల ఆత్మ దర్శనం కాదు. అందుచేత దూరదృష్టి కంటే లోపల దృష్టి చాలా గొప్పది.

ఊరికి వెళ్ళాలి అంటే డబ్బు ఉండాలి, దేహానికి సంబంధించిన యాత్ర వెళ్ళాలి అంటే డబ్బు ఉండాలి, తినడానికి డబ్బు ఉండాలి, తిరగడానికి డబ్బు ఉండాలి, బట్టలు కట్టుకోవడానికి డబ్బు ఉండాలి. సంసారంలో కూడా సాధ్యమైనంత వరకూ న్యాయమార్గంలో ఆర్జించాలి. సన్యాసికి అక్కర్లేదు కానీ గృహస్థుడికి డబ్బు అవసరమే కదా. భగవాన్‌కి డబ్బుతో పనిలేదు. కానీ మనకు పనిలేదు అనుకుంటే ఎలాగ? సన్యాసికి నిజంగా డబ్బు తోటి పనిలేదు. కానీ గృహస్థుడికి డబ్బు కావాలి. తినడానికి అవసరం, తిరగడానికి అవసరం. ఏ పని చెయ్యడానికి అయినా డబ్బు అవసరం. అది సాధ్యమైనంత వరకు న్యాయబద్ధంగా సంపాదించాలి.

గీతలో ఏమి చెప్పాడు అంటే నీ దేహానికి, నీ కుటుంబయాత్రకి సరిపడా సంపాదించుకో. లోకంలో కొంతమంది ఆకలితో బాధ పడుతుంటే, కొంతమంది అజీర్తితో బాధ పడుతున్నారు. తినడానికి తిండిలేక కొంతమంది బాధ పడుతున్నారు. తింటే అరగక కొంతమంది బాధ పడుతున్నారు. వైష్ణవ సాంప్రదాయంలో ఏమని చెప్పారు అంటే మాకు ఆకలి బాధ కలుగజేయకు. ఎందుచేత అంటే ఆకలితో ఉంటే నిన్ను స్మరించలేను. మళ్ళీ ఐశ్వర్యంలో ముంచేయకు, ఐశ్వర్యంలో ముంచేస్తే నిన్ను మర్చిపోయి అస్తమాను ఐశ్వర్యం గురించే ఆలోచిస్తూ ఉంటాను. అంటే మధ్యేమార్గాన్ని మాకు ప్రసాదించు అన్నారు వైష్ణవ సాంప్రదాయంలో, ఈ మధ్యేమార్గాన్ని సంపాదించే యోగ్యత నాకు ఇవ్వు. అజీర్తి బాధ నాకు పెట్టకు, ఆకలి బాధ నాకు పెట్టకు అంటారు.

గుడ్డివాడు ఎవడు? కళ్ళు లేని వాడు గుడ్డివాడు అనుకుంటున్నాం. ఆచార్యుల వారు చెప్పేది ఏమిటంటే, ఎవడైతే చెడ్డ మాట్లాడుతున్నాడో, ఎవడైతే చెడ్డ స్మరిస్తున్నాడో, ఎవడైతే చెడ్డ చేస్తున్నాడో వాడు గుడ్డివాడు అని చెప్పారు. మనం అనుకునే అన్నిటికీ విరుద్ధంగా చెబుతున్నారు ఆచార్యుల వారు. మనం గుడ్డివాడు అంటే కళ్ళు లేనివాడు గుడ్డివాడు అనుకుంటున్నాం ఆచార్యుల వారు ఏమని చెబుతున్నారు అంటే చేతుల తోటి ఎవడైతే చెడ్డ చేస్తున్నాడో, కళ్ళతోటి

ఎవడైతే చెడ్డ చూస్తున్నాడో, చెవుల తోటి ఎవడైతే చెడ్డ వింటున్నాడో, ఎవడైతే చెడ్డ స్మరిస్తున్నాడో వాడు గుడ్డివాడు అని చెబుతున్నారు. కొంతమంది ఎలా ఉంటారు అంటే మనం ఏదైనా మంచిమాట చెపితే వినరు, చెడ్డ చెపితే మళ్ళీ చెప్పండి, మళ్ళీ చెప్పండి అంటారు. అంటే వాళ్ళు ఎంతో శ్రద్ధగా వింటారు. లోపల దుర్మార్గపు ఆలోచనలు అలా ఉంటాయి. మనం చెడ్డ చెప్పడం వల్ల వారికి లోపల సంతోషం వస్తుంది ఆ సంతోషం తట్టుకోలేక మళ్ళీ చెప్పండి, మళ్ళీ చెప్పండి అంటారు. ఏమిటి లోపల దుర్మార్గం ఉంది, లోపల చెడ్డ ఉంది. లోపల వీళ్ళకి చెడ్డ ఉంది కాబట్టి ఆ చెడ్డ అస్తమాను వీళ్ళకి వినాలనిపిస్తుంది.

మీకు జీవిత రహస్యం చెబుతున్నాను. మీ జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, మీ ఇంట్లో జరిగే సంఘటనలు, మీ బంధువుల తోటో, మీ స్నేహితుల తోటో మీకు ఎదురయ్యే సంఘటనలు సమాజంలో మనుషుల తోటి మీకు ఎదురయ్యే సంఘటనలు అన్నింటిని మీ బుద్ధికి పనిచెప్పి జాగ్రత్తగా పరిశీలించటం నేర్చుకోండి. నేను మాట్లాడుతున్నాను అనుకోండి నేను మాట్లాడేటప్పుడు ఏ ఉద్దేశ్యంతో నేను మాట్లాడుతున్నానో, ఏ హృదయంతో నేను మాట్లాడుతున్నానో, ఏ తపనతో నేను మాట్లాడుతున్నానో, అది కూడా మీరు పరిశీలించుకోండి. ఏ మహాత్ముడు చెప్పినా పరిశీలన లేకుండా మీరు ఒక్క మాట కూడా తీసుకోకండి. కొంతమంది మనుషులు ఎలా ఉంటారు అంటే వాళ్లకి ఏమీ కలిసి రాకపోయినప్పటికీ ఎదుటి వాళ్ళు చేసే మంచి పనులని చెడ గొట్టేస్తారు. అటువంటి మనుషులని ఏమని పిలవాలోనాకు అర్థం కాదుఅని భర్తృహరి చెప్పాడు. వాళ్లకి కలిసి రాదు. పోనీ వాళ్లకి కలిసి వస్తే వాళ్ళ స్వార్థం కోసం అనుకోవచ్చు, వాళ్లకి కలిసి రాకపోయినా ఎదుటి వాడు ఏదైనా మంచి పని చేస్తుంటే అది చెడ గొట్టడానికి చూస్తున్నారంట కొంతమంది మనుషులు, ఆ మనుషులని మూర్ఖులు అనాలో, నీచులు అనాలో వాళ్లకి ఏ పేరు పెట్టాలో అర్థం అవ్వటం లేదు నేను ఎంత పండితుడు అయినప్పటికీ అని భర్తృహరి చెప్పాడు. ఇంట్లో కృష్ణుడు పటం పెట్టుకుంటున్నాం, భగవాన్ పటం పెట్టుకుంటున్నాం. గాంధీగారు పెట్టుకున్నది రాముడి పటం కాదు, భగవాన్ పటం కాదు, కృష్ణుడి పటం కాదు, మూడు కోతుల బొమ్మ ఎప్పుడూ ఎదురుగా పెట్టుకునేవారు గాంధీగారు. ఆ మూడు కోతుల బొమ్మలో ఒక కోతి ఏమో కళ్ళు మూసుకుంటుంది. ఒక కోతి ఏమో చెవులు మూసుకుంటుంది. ఒక కోతి ఏమో


నోరు మూసుకుంటుంది. అంటే నోరు మూసుకునే కోతి కూడా గాంధీ గారికి గురువట అంటే చెడ్డ మాట్లాడకండి. కళ్ళు మూసుకున్న కోతి కూడా గాంధీ గారి గురువట అంటే చెడ్డ చూడకండి. చెవులు మూసుకున్న కోతి కూడా గాంధీగారికి గురువట అంటే చెడ్డ వినకండి. మూడు కోతులు నా గురువులు అని గాంధీజీ చెప్పారు.

మీ ప్రయత్నంతో నిమిత్తం లేకుండా, మీ సాధనతో నిమిత్తం లేకుండా ఈశ్వరుడు మీకు మోక్షం ఇస్తాడు. ఎప్పడు అంటే మీ జీవితం సహజమైనది కావాలి. సరళమైనది కావాలి. మీరు సరళంగా జీవిస్తే, సహజంగా జీవిస్తే జ్ఞానం అనే కిరీటం తీసుకు వచ్చి మీ శిరస్సు మీద అలంకరిస్తాడు ఈశ్వరుడు. బలవంతంగా సాధన చేయకూడదు, ఈశ్వరుడి మీద గౌరవం ఉండాలి. మీ హృదయంలో ఈశ్వరుడు మీద గౌరవభావం లేనప్పడు సాధనలు పేరు మీద ఎంతకాలం ఈశ్వరుడిని మోసం చేస్తారు. మనం చేసే సాధన కాదు ఈశ్వరుడు చూసేది, మన హృదయాన్ని ఈశ్వరుడు చూస్తాడు. ఎందుచేత? ఆయన మన హృదయంలో ఉన్నాడు కాబట్టి.

భగవంతుడు వైకుంఠంలో ఉంటే భగవంతుడిని మనం మోసం చెయ్యవచ్చు, కైలాసంలో ఉంటే కైలాసంలో ఉన్న భగవంతుడిని కూడా మనం మోసం చెయ్యవచ్చు. నేను నీ హృదయంలో ఉన్నాను అని పరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. చెవిటి వాడు ఎవడండి? మంచి మాటలు చెబుతుంటే ఎవడైతే వినడో వాడు చెవిటివాడు. మంచి మాటలు చెబుతుంటే ఎవడైతే వినడో, వాడికి చెవులు ఉన్నా కానీ చెవులు లేనట్టే లెక్క! మనకు కళ్ళు ఉన్నాయి, చెవులు ఉన్నాయి, నోరు ఉంది, కానీ ఇవన్నీ మనకి ఉపకారం కంటే ఎక్కువ అపకారం చేస్తాయి. మన దగ్గర ఉన్న డబ్బు కూడా మనకి ఉపకారం కంటే ఎక్కువ అపకారం చేస్తుంది. మన దగ్గర ఉన్న చదువు కూడా మనకి ఉపకారం కంటే ఎక్కువ అపకారం చేస్తుంది. యేసు అన్నాడు నీ కళ్ళు నీకు అపకారం చేస్తుంటే నీ కళ్ళు పీకి అవతల పాడేయ్ అని చెప్పాడు. యేసుని శిలువ వెయ్యడానికి తీసుకుని వెళ్తుంటే కొంతమంది స్త్రీలు ఏడుస్తారు. నా గురించి ఏడవడం ఆపు చెయ్యండి. నాకు అలా రాసి ఉంది, నాకోసం ఏడవకండి. ఎందుకు నా కోసం ఏడుస్తున్నారు? నా దేహం కోసం మీ కాలాన్ని ఖర్చు పెట్టుకోకండి, మీ హృదయంలో ఉన్న వెలుగును చూడటానికి ప్రయత్నం

చెయ్యండి అన్నాడు యేసు.

దైవం కోసం ఎవడైతే తపిస్తున్నాడో వాడికే దైవ సాక్షాత్కారం అవుతుంది. ఈశ్వరుడి కోసం తపించాలి. రోజుకి ఇరవై నాలుగు గంటలు అయితే ఎన్ని గంటలు మీరు భగవంతుడి కోసం జీవిస్తున్నారు? అసలు జీవించడమే తెలియని వాడికి మరణించటం ఎలా తెలుస్తుంది? మీకు బాహ్యవస్తువుల తోటి అలంకరించుకోవాలి అని సరదా ఉంది కానీ ఈశ్వర అనుగ్రహం తోటి అలంకరించుకోవాలి అని సరదా ఎక్కడ ఉంది? నువ్వు అలంకరించుకో, ఈశ్వరుడి అనుగ్రహం తోటి అలంకరించుకో. ప్రపంచంలోఎన్ని సాధించినా, ఎంత పుణ్యం చేసినా ఒకటి లేని సున్నా. ముందు ఒకటి వేసి తరువాత సున్నలు వేసుకుంటూ వెళితే సున్నల విలువ పెరుగుతుంది. పది, వంద, వెయ్యి, పదివేలు, లక్ష, అలా ఎన్ని సున్నలు వేస్తే అంత విలువ పెరుగుతుంది. ఒకటి లేకుండా సున్నలు చుట్టుకుని వెళ్ళిపోతే, ఎన్ని సున్నలు వేసినా విలువ లేదు, ఇరవై సున్నలు వేసినా ఒక సున్నా ఉన్నట్టే! ఆత్మని దర్శించటం వదిలేసి, ఆత్మను వదిలేసి ఈ లోకంలో ఎన్ని ఘన కార్యాలు చేసినా ఒకటి లేని సున్నా. మొట్టమొదట ఒకటి లేదు కదా ఇంక ఆ సున్నలకి విలువ ఏమిటి? ఎన్ని సున్నలున్నా ఒకటే. మంచి మాట ఎవడైతే చెప్పలేడో వాడు మూగవాడు. కొంతమంది ఏమంటారు అంటే మేము చెప్పింది వారు వినరు కాబట్టి చెప్పలేదు అంటారు అది నిజం కాదు. మీరు మంచి మాట ఎవరికైనా చెప్పాలి అనుకుంటే తప్పనిసరిగా చెప్పండి. అవసరాలని బట్టి, సందర్భాలని బట్టి తప్పనిసరిగా చెప్పాలి. వారు వినరు అనుకోండి మీకు సంబంధం ఏమిటి అసలు? వాడు వింటాడా,



**జ్ఞానం అంటే ఏమిటి అని రామకృష్ణ పరమహంస గారిని అడిగారు. ఒక వాక్యములో ప్రశ్న అడుగుతున్నాను, ఒక వాక్యములోనే సమాధానం చెప్పమన్నారు. ప్రతి మనిషి నేను నేను అంటాడు, ఏదైతే నేను నేను అని నువ్వు అంటున్నావో, ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే ఆత్మ జ్ఞానం, అన్నారు రామకృష్ణుడు.**

వినడా అనేది వేరే విషయం.

అదే భగవద్గీతలో స్పష్టంగా చెప్పారు. మీకు పనిచెయ్యడానికి హక్కు ఉంది, చెప్పడానికి హక్కు ఉంది, కానీ ఫలితం మీ చేతులలో లేదు. వాడు వింటాడా, వినడా అనేది వేరే విషయం. అవసరం అయినప్పుడు మీరు మంచి మాట చెప్పండి. మీ పిల్లలు ఉన్నారు వాళ్ళు శ్రద్ధగా చదువుకోవచ్చు, శ్రద్ధగా చదువుకోలేక పోవచ్చు, శ్రద్ధగా చదువుకోమని చెప్పండి. వాళ్ళు వినకపోతే అది వేరే విషయం. చెప్పటం మానద్దు అంటున్నాడు. అలా మంచి మాట కనుక మీరు చెప్పలేకపోతే మీకు నోరు ఉండి నోరు లేని వాళ్ళతో సమానం. మంచి విషయాలు చూడకపోతే కళ్ళు ఉండి కళ్ళు లేని వాళ్ళతో సమానం. మంచి మాటలు వినకపోతే చెవులు ఉండి చెవులు లేని వాళ్ళతో సమానం. వాళ్ళు వినరండిఅంటారు అది అనవసరం మీకు, వాళ్ళు వింటారోవినరో కాదు. ముందు మీ పని మీరు చెయ్యండి వాళ్ళు వింటారో, వినరో అన్నది వేరే విషయం. పేపర్ రాయాలి కదా ముందు, వాళ్ళు ఎక్కువ మార్కులు వేస్తారో, తక్కువ మార్కులు వేస్తారో మనం చెప్పలేము మనం రాసిన దానిని బట్టి వేస్తారు పేపర్ రాయాలి కదా, ఎవడో మార్కులు సరిగా వేయడని మొత్తం పేపర్ రాయడం మానేస్తే ఎలా అసలు? అలా మన ఇంట్లో అయినా సరే, వీధిలో అయినా సరే, అవసరమైన సమయం వచ్చినప్పుడు నాలుగు మాటలు చెప్పాలి, చెప్పకపోతే ఏమవుతుంది అంటే అది దోషం అవుతుంది.

భారతంలో కృష్ణుడు రాయబారానికి వెళ్ళాడు. దుర్యోధనుడు వినడన్న సంగతి కృష్ణుడికి తెలియదా? కృష్ణుడు భగవంతుడు కదా, దుర్యోధనుడు వినడు అన్న సంగతి ఈయనకి తెలుసు. కానీ కృష్ణుడు అంతటివాడు మంచి పని చేయలేదని లోకం నిందిస్తుందని ఆ పని చేశాను అన్నాడు. కృష్ణుడు ఉండి కూడా నాలుగు మంచి మాటలు చెప్పలేకపోయాడు అని లోకం ఎత్తి పోస్తుంది కదా, అందుకుచెప్పాడు. దుర్యోధనుడు వినడు అన్న సంగతి ఈయనకి తెలుసు. మన డ్యూటీ మనం చెయ్యాలి. ఇక్కడ ఏమనిపిస్తుంది, కృష్ణుడు చెప్పలేదు ఒకవేళ చెబితే వినేవాడు ఏమో అని లోకానికి అనిపిస్తుంది. ఎక్కడో యుద్ధ సమస్యలే కాదు మన ఇంట్లో సమస్యలు కూడా అంతే, మనం చెప్పవలసిన మాటలు చెప్పాలి. వాడు వినడు అనుకోండి వదిలేయండి. ఊరికే

అది అంతా లోపల పెట్టుకుని వినలేదు వినలేదు అని బాధ పడకండి. అలా బాధ పెట్టుకున్నారో మళ్ళీ దుఃఖం వచ్చేస్తుంది. ఇది జ్ఞాపకం ఉంచుకోండి. మీరు మంచి మాట చెప్తారు, వినలేదని మీరు బాధపడటం మొదలు పెడితే కొత్త సంస్కారాలు వచ్చి మళ్ళీ తగులుకుంటాయి. లోకమాన్య తిలక్ గారు ఏమన్నారంటే ఈ రెండు మాటలు మీ హృదయంలో పెట్టుకోండి ఇంకేమి అక్కర్లేదు అన్నారు. ఆయన ఏమన్నారు అంటే భగవంతుడు చెప్పిన ముఖ్యమైన మాట ఏమిటి అంటే గీతలో, నువ్వు పని చెయ్యి ఫలితం గురించి ఆలోచించకు. ఫలితం రావచ్చు, రాకపోవచ్చు దాని గురించి నువ్వు ఆలోచించకు. ఆలోచిస్తే నీ శక్తి ఖర్చు కానీ ఏమీ ప్రయోజనం లేదు. అలాగని పని మటుకి విడిచి పెట్టకు. ఆ పని యొక్క ఫలితం ఈశ్వరుడు చూసుకుంటాడు. ఎందుచేత పని నీ చేతిలో ఉంది కానీ, ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది. ఫలితం గురించి నిన్ను ఆలోచించవద్దు అని చెబుతున్నాను కాబట్టి పని మాత్రం విడిచి పెట్టకు అని చెప్పాడు కృష్ణుడు. ఎక్కడికక్కడ లంకె పెట్టేస్తున్నాడు. అటు ఇటు కదలకుండా గొలుసు వేసి కట్టేసినట్టు కట్టేస్తున్నాడు. భగవంతుడు ఫలితం కోరవద్దు అని చెప్పాడు అని మొత్తం మీద పని విడిచి పెట్టకండి. మంచానికి నాలుగు కోడులు ఎటువంటివో, ఈ నాలుగు మాటలు అటువంటివి అని తిలక్ గారు తన గీతా రహస్యంలో చెప్పారు. నాలుగు కోడుల వల్ల మంచం ఎలా నిలబడుతుందో, ఈ నాలుగు మాటలు జ్ఞాపకం ఉంచుకోవడం వల్ల జీవితం కూడా అలా నిలబడుతుంది అని చెప్పారు.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

- సేకరణ : బేబీ, హైదరాబాద్

**త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ 2-45 ॥**

తాత్పర్యము: ఓ అర్జున! వేదములు సత్త్వరజస్తమో గుణముల కార్యరూపములైన సమస్త భోగములను గూర్చియు, వాటిని పొందుటకై చేయవలసిన సాధనలను గూర్చియు ప్రతిపాదించును. నీవు ఆ భోగముల యెడలను వాటి సాధనలయందును ఆసక్తిని త్యజింపుము. హర్షశోకాది ద్వంద్వములకు అతీతుడవు కమ్ము. నిత్యుడైన పరమాత్మ యందే స్థితుడవు కమ్ము. నీ యోగక్షేమముల కొఱకై ఆరాటపడవద్దు. అంతఃకరణమును వశమునందు ఉంచుకొనుము.

వేదం అంటే జ్ఞానం అని అర్థం. వేదంలో ఒక్క ఆత్మజ్ఞానం గురించే కాదు, భౌతిక ఖగోళ జ్ఞానం గురించి కూడా చెప్పారు. పెళ్లిమంత్రాలు, ఇల్లు ఎలా కట్టుకోవాలి, జీవుడు శరీరాన్ని విడిచిపెట్టి నప్పుడు చదివే మంత్రాలు అన్నీ చెప్పారు. వేదంలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం లేదు. ఏ పూజ చేస్తే, ఏ యజ్ఞం చేస్తే ఏ కోరిక నెరవేరుతుందో అది కూడా వేదంలో చెప్పబడ్డాయి. మానవుడికి ఏవో కోరికలు ఉంటాయి, తప్పేమీ లేదు. ధర్మ, అర్థ, కామ, మోక్ష, ఈ పురుషార్థాలు అన్నీ చెప్పారు. అయితే అర్థ కామాలను ధర్మ మోక్షాల మధ్య బిగించారు. అర్జునా వేదాలలో రకరకాల విషయాలు చెప్పారు. నువ్వు ఆ కోరికల గొడవ వదిలేయి, నీకు ఆత్మ జ్ఞానం సంపాదించే యోగ్యత ఉంది.

**నిస్త్రైగుణ్యో:** వేదాలలో సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం గురించి చెప్పారు. ఒకో గుణానికి ఒకో స్వభావం ఉంటుంది. ఏ గుణం యొక్క ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు వాళ్ళ ప్రవర్తన ఎలా ఉంటుందో కూడా చెప్పారు. భగవంతుడు ఈ మూడు గుణాలలో మాయ పెట్టాడు.

అందులో మంచి గుణాలు ఉండవచ్చు, చెడ్డ గుణాలు ఉండవచ్చు. అవన్నీ మాయకు సంబంధించిన విషయాలు. ఈ గుణాలన్నీ బంధించేవి. కొందరికి భోగాలు అంటే ఇష్టం, భోగాలు అనుభవిస్తూ ఎవడూ భోగాలను జయించలేదు. నిప్పు మీద నెయ్యి వేస్తూ నిప్పు ఆర్పగలమా? ఆ గొడవలు నీకు అనవసరం. నీ గమ్యం భోగాలు కాదు. నీ స్వరూపంలో సుఖం ఉంది. ఆ గుణాలని అతిక్రమించి బయటికి రా! నీకు పాత అలవాట్లను బట్టి ఆ గుణాలు వస్తూ ఉంటాయి. అలవాట్ల యొక్క వేగం తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు గుణాతీతుడవు అవ్వాలి. నువ్వు బ్రాహ్మీస్థితిని సుఖస్థితిని పొందాలి అని పరమాత్మ చెప్పాడు.

**నిర్ద్వంద్వః** మన ప్రారబ్ధాన్ని బట్టి మనకి దుఖం వస్తూ ఉంటుంది, సంతోషం వస్తూ ఉంటుంది. తల్లి గర్భంలోంచి వచ్చింది మొదలు శ్మశానానికి వెళ్లేవరకు ఏ జీవితం సమానంగా వెళ్లదు. సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకుండా, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోకుండా నువ్వు బ్యాలెన్స్ చేసుకుంటూ ఉంటే, నీ బుద్ధి పవిత్రమవుతుంది, ఏకాగ్రమవుతుంది. ఎడ్యుకేషన్ అంటే ప్రపంచములో వున్న విషయాలని సేకరించటం కాదు, నువ్వు పవిత్రుడవు అవ్వటం, ఏకాగ్రత సంపాదించటం, ఇవి విద్యలో ముఖ్యమైన భాగాలు. నువ్వు బ్రెయిన్ని బాలన్స్ చెయ్యటం అలవాటు చేస్తే ఏకాగ్రత పవిత్రత వస్తాయి. నీ ప్రవర్తనలో వినయం వస్తుంది, అహంకారం ఉంటే తగ్గిపోతుంది అర్జునా!

ధనాన్ని బట్టి, విద్యని బట్టి, అధికారాన్ని బట్టి మనిషికి ఎంతోకొంత గర్వం ఉంటుంది. చనిపోతే ధనానికి వాడికీ ఏమీ సంబంధం ఉండదు. ఇలా తాను కాని విషయాలతోటి తాదాప్యం పొంది అహంకారం, గర్వం తెచ్చుకుంటాడు. నీకు డబ్బు ఉండవచ్చు కాని నువ్వు డబ్బు కాదు. ఇప్పుడు నీకు ఏదైనా అధికారం ఉండవచ్చు, కాని ఎప్పుడూ నువ్వు అధికారంలో ఉండవు. కాలప్రవాహంలో అవి వస్తూ పోతూ ఉంటాయి. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే గొడవల్ని పట్టుకొని నువ్వు పతనం అవ్వకు.

నీ జీవితంలో ద్వంధ్వాలు వస్తూ ఉంటాయి. నువ్వు తట్టుకోవటం నేర్చుకుంటే నువ్వు పవిత్రుడవు అవుతావు. నిర్మలుడవు అవుతావు. నీ బుద్ధి నిశ్చలముగా ఉంటుంది. నువ్వు ద్వంద్వాలు తట్టుకుంటూ ఉంటే నీ మనస్సు నీకు విరోధంగా ఉండదు. నీ మనస్సు నీకు మిత్రుడిగా ఉంటే, నీకు సేవ చేస్తుంది. నీ మనస్సు నీకు శత్రువుగా ఉంటే నీకు అపకారం చేస్తుంది. బయట వాళ్ళు నీ పట్ల ఎలా ఉన్నారు అని కాదు, ముందు నీ మనస్సుని నువ్వు స్వాధీనం చేసుకో, అది నీకు అనుకూలంగా ఉండేటట్టు చేసుకో అంటున్నాడు పరమాత్మ.

**నిత్యసత్త్వస్థ :** దేహముతోటి మనస్సుతోటి ఇంద్రియములతోటి సంబంధము లేకుండా ఒక చావు లేని సత్వదార్థము నీ హృదయములో ఉంది. . ఆ సద్వస్తువు నీకు చాలా క్లోజుగా, నియర్‌గా, డియర్‌గా ఉంది. అంతేకాదు అది నీవై ఉన్నావు! కానీ నీ రాంగ్ థింకింగ్ వలన, రాంగ్ ఐడెంటిఫికేషన్ వల్ల అది నీవు అన్న సంగతి నీకు తెలియటం లేదు. సత్యమైనది


నిత్యంగా ఉంటుంది కాని, సత్యము కానిది ఏది నిత్యముగా ఉండదు. నువ్వు సుఖపడాలి అంటే నీ హృదయంలో ఉండటం నేర్చుకో. అక్కడ నువ్వు స్థిరంగా ఉండగలిగితే, నువ్వు కానీ దానిలోనుంచి నెమ్మదిగా వేరుపడతావు. అప్పుడు నీ శరీరము, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి అన్నీ నీకు స్వాధీనంలోకి వచ్చి, నువ్వు సుఖపడతావు. నువ్వు ఇంద్రియముల స్వాధీనములో, మనస్సు స్వాధీనములో ఉంటే సుఖపడవు. అందుచేత వాటిని కంట్రోల్ చేయటం నేర్చుకోవాలి. కంట్రోల్ ఇచ్చే ఆనందం మనకు కంఫర్ట్ ఇవ్వదు.

నీ హృదయములో ఉన్న సద్వస్తువులో ఉండటం అలవాటు చేసుకో. దానితోటి జతచేయటం చేతకాకపోతే, ఎలా స్నేహం చెయ్యాలో తెలియకపోతే, బయట సత్పురుషుల తోటి సహవాసం చెయ్యటం నేర్చుకో. వాళ్ళ వైబ్రేషన్స్ నీ మీద పని చేస్తూంటాయి. అప్పుడు సద్వస్తువును తెలుసుకోవాలనే కాంక్ష నీకు వస్తుంది అంటున్నారు భగవాన్.

**నిర్యోగక్షేమః -** యోగం అంటే లేనిది సంపాదించటం, క్షేమం అంటే ఆ వచ్చిన దానిని గట్టిగా పట్టుకోవటం, అది పోకుండా అన్నివేళలా కాపాడుకోవటం. ఎవడి యోగక్షేమాలు వాడు చూసుకొంటూ ఉంటాడు. ఓ అర్జునా! అందరి గొడవ నీకెందుకు నీ యోగక్షేమాలు చూసుకోవటం తగ్గించుకో. ఆత్మవిచారణ చేసుకో, సత్యాన్వేషణలో ఉండు. ఎవడైతే తన యోగక్షేమాలు వదిలేశాడో, వాడి యోగక్షేమాలు భగవంతుడు చూసుకొంటాడు. అయితే నీకు నమ్మకం ఉండాలి. ప్రపంచాన్ని చూసేవాడు ఒకడు ఉన్నాడు, వాడే నీ యోగక్షేమాలు కూడా చూస్తాడు. అస్తమాను నీ యోగక్షేమాలు నువ్వు చూసుకుంటూ ఉంటే, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, అంతర్ముఖం అవ్వదు, అంతర్దృష్టి రాదు.

**ఆత్మవాన్ -** నీకు అంతఃకరణం, అంటే లోపల ఒక పనిముట్టు ఉంది. శరీరాన్ని ఎలా శుద్ధిగా ఉంచుకొంటున్నావో, లోపల బుద్ధిని కూడా శుద్ధిగా ఉంచుకోవాలి. నీ బుద్ధి శుద్ధిగా లేకపోతే నీ అంతఃకరణం పవిత్రంగా, నిర్మలముగా లేకపోతే, నీలో ఉన్న స్వరూపం నీకు ఎరుకలోకి రాదు, నువ్వు ఆత్మవంతుడవు, జ్ఞానవంతుడవు అవ్వలేవు అర్జునా! గాలి లేని చోట, కెరటం లేనప్పుడు, నీళ్ళు ఎలా ఉంటాయో, నీ బుద్ధి అంత నిర్మలముగా స్వచ్ఛముగా ఉండాలి. సుఖము శాంతి అనేది నీ స్వరూపము లోనే ఉంది. ఇప్పుడు నువ్వు పొందే సంతోషాలు అన్నీ పరిణామంలో ఎప్పటికైనా దుఖం కింద మారిపోతాయి. నువ్వు జ్ఞానం సంపాదిస్తే నీ దుఖం అంతా సుఖముగా మారిపోతుంది.

నీ అంతఃకరణాన్ని శుద్ది చేసుకోకుండా నువ్వు ఆత్మవంతుడవు అవ్వలేవు. అంటే స్వరూప సుఖం నీకు తెలియదు. నిత్య సుఖం, శుద్ధమైన సుఖం ఒక్క స్వరూపం లోనే ఉంది కాని బయట ఏ వస్తువు లోనూ ఏ పదార్థము లోనూ సుఖము అనేది లేదు. ఆ స్వరూప సుఖం, ఆ బ్రాహ్మీస్థితి నువ్వు పొందాలి, అంతఃకరణాన్ని శుద్ధి చేసుకొని, పవిత్రం చేసుకొని నువ్వు ఆత్మ సంపదని పొందు, ఆత్మవంతుడవు అవ్వు అర్జునా!



# అరుణాచల మహత్మ్యం అక్షరమణమాల

సేకరణ: రాజేశ్వరి గారు, హైదరాబాదు

**ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు**

**ఎవరిది నీజాలము అరుణాచలా! ।12।**

తాత్పర్యము: ఉన్నది నీవు ఒక్కడివే కదా! నిన్ను మోసం చేసి రాగల శక్తి ఎవరికుంది అరుణాచలా? ఇదంతా నీ మాయాజాలము కదా!

ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. రకరకాలుగా కనిపిస్తోంది. ఇదంతా నిజము కాదు. రెండు అనేది లేదు. మరి ఈ బేధబుద్ధి ఎక్కడినుంచి వస్తోంది, ఈ ప్రపంచం, సమాజం ఎక్కడినుంచి వస్తోంది. ఈ జీవకోటి ఎక్కడినుంచి వస్తోంది. ఇదంతా నీ మాయ, నువ్వు పన్నిన వల.

ఉన్నది ఒక్కటంటే ఒక్కటే, కానీ నువ్వు వేరు నేను వేరు, ప్రపంచం వేరు నేను వేరు, దేవుడు వేరు నేను వేరు. నేను లోపల ఉన్నాను, నా బయట ప్రపంచం ఉంది. ఎక్కడో కైలాసంలో శివుడు ఉన్నాడు, వైకుంఠం లో నారాయణుడు ఉన్నాడు. ఇలా మనిషికీ మనిషికీ మధ్య బేధ బుద్ధి. ఒక ఇంటిలో నలుగురు ఉంటే నాలుగు పార్టీలు. ఈ బేధ బుద్ధి మాయ, ఇదంతా నువ్వు కల్పించావు. వలలోనుంచి చేప బయటికి వచ్చేస్తే దానికి ఫ్రీడం వచ్చేసినట్టే కదా. అలాగే నువ్వు కల్పించిన దానిలో నుండి మేము బయటపడితే నువ్వు లభ్యమవుతావు.

ఇదంతా నీ మాయ వయ్యా అరుణాచలేశ్వరుడా! ఇదంతా నువ్వు పన్నిన వల. ఎవడైతే ఆ మాయలో పడడో, నువ్వు పన్నిన వలలోనుంచి ఎవడైతే బయటికి వచ్చాడో, వాడు మట్టుకే ఈశ్వరుడిని పొందుతాడు. అంటే ఉన్న వస్తువు ఉన్నట్లుగా పొందుతాడు. తెలివైనవారు, వివేకవంతులు, సాధనాపరులు ఈ వలలో పడరు. తిరగలికి మధ్యలో ఉన్న రాడ్ దగ్గరికి చేరిన గింజలని తిరుగలి నలపలేదు. అలాగే ఏ జీవుడైతే పరమాత్మని ఆశ్రయించాడో ప్రపంచం వాడిని నలపలేదు. వాడు అందరిలాగానే ప్రపంచంలో ఉన్నా,

ప్రపంచం వాడిని ముట్టుకోలేదు, బాధించలేదు. ఎందుకంటే వాడు ద్వైతానికి అతీతుడు. బ్రాహ్మీ స్థితి పొందిన వాడికి ఎవరైనా స్తోత్రం చేసినా ఏమీ అనిపించదు, ఎవరైనా నిందించినా కూడా ఏమీ అనిపించదు. ఇవి రెండూ మాయ! డబ్బు ఉండటం లేకపోవటం, అందంగా ఉండటం లేకపోవటం, వారు పెద్దవారు, వీరు తక్కువ వారు, ఈ హెచ్చుతగ్గులు అన్నీ భగవంతుడిలో లేవు, ఇవి మనస్సు కల్పించిన విషయాలు.

శరీరం చనిపోవటం ఎంత అబద్ధమో,మళ్ళీ ఆ జీవుడు ఇంకో శరీరం ధరిస్తాడు, అదీ అంతే అబద్ధం. ఇది మహా మాయ. మాయకి అధిపతి ఈశ్వరుడు. పాము నోటిలో ఉన్న విషం పాముని ఏమీ చేయదు. అలాగే భగవంతుడిలో ఉన్న మాయ భగవంతుడిని ఏమీ చేయదు. భగవంతుడి అనుగ్రహం ఉంటే, దయ ఉంటే ఆయన మాయ మనకి దారి ఇస్తుంది, మనం భగవంతుడిలో ఐక్యం అవుతాము. దేవుని అనుగ్రహం సంపాదించాలి, అదే నిజమైన ఆస్తి. మన మాటలో చేతలో ఆలోచనలో దేవుని దయ సంపాదించటానికి ప్రయత్నం చెయ్యాలి. ఆయన దయ ఉంటే చాలు, ఇంకేమీ అక్కరలేదు.

ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు ఎవరూ! ఇది నీజాలము అరుణాచాలా! ఇది పెద్ద మాయ! ఈ జీవకోటి వచ్చి నువ్వు పన్నిన వలలో పడుతున్నారు. ఈ వలలో పడకుండా ఎవడైతే తప్పించుకున్నాడో, వాడే జీవన్ముక్తుడు.

**గాయత్రి మంత్రం అర్థం:**

**నాకు సద్బుద్ధి ప్రసాదించు, సహృదయం ప్రసాదించు. ఎలా జీవిస్తే నువ్వు ఎరుకలోకి వస్తావో, అలా జీవించే విధానం నాకు నేర్పు అని గాయత్రి మంత్రం అర్థం. సద్బుద్ధి ఉంటే అన్నీ మన చేతిలో ఉన్నట్టే. మన బుద్ధిని బాగు చేసుకుంటే, మనకి సత్యానికి వెళ్ళే మార్గం చూపిస్తుంది. దేహము కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియముల కంటే మనస్సు గొప్పది, మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే చైతన్యము గొప్పది. చైతన్యము, మన బుద్ధికి మన మైండుకి ఆబ్జెక్ట్ కాదు, ఇది లెక్కలు, ఇంగ్లీష్ నేర్చుకున్నట్టు కాదు. మనస్సు అణిగిపోయిన దగ్గర నీకు చైతన్యము అనుభవము లోనికి వస్తుంది.**

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# స్వరూపమే శాంతి

వాస్తవంగా తాను ఎవరో ఎరుకలేకుండానే మానవ జీవితాలు సాగిపోతున్నాయి. ఏదో సాధించాలి, ఎక్కడికో వెళ్ళిపోవాలి అని ఆరాటపడతాం! ఇప్పుడు వర్తమానంలో ఉన్న స్థితికి భిన్నముగా ఏదో కావాలని కోరుకుంటాం! భౌతికంగా అయితే మంచి శరీర ఆరోగ్యము, సంపద, కీర్తి అట్లే భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటాం! వీటికి కారణం ఈ వర్తమానంలో పరమాత్మ మనకు ప్రసాదించిన వాటిపట్ల సంతృప్తి లేకపోవడమే! అట్టి అసంతృప్తే దుఃఖానికి, అశాంతికి కారణం అవుతుంది. నీ స్వరూపమే సుఖము, నీ స్వరూపమే శాంతి అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. నిజమైన సుఖము, శాంతి మన స్వరూపము కన్నా భిన్నముగా భవిష్యత్తులో ఎక్కడో లేదు. మన స్వరూపమే శాంతి కాబట్టి, శాంతిని బాహ్యములో స్వరూపము కన్నా భిన్నముగా వెదకుట వలన అది ఎప్పటికీ ఎండమావిలో నీరు వంటిదే అవుతుంది. ఒక్క చైతన్యము తప్ప మిగిలినవన్నీ మార్పుకు లోనయ్యేవే, అట్టి మార్పుకు లోనయ్యే దృశ్యపదార్థములనుండి శాశ్వతమైన శాంతి ఎలాగ లభిస్తుంది? ఏదైనా వెదుకుతున్నాము అంటే, మనము అప్పటికే దానిని పోగొట్టుకున్నట్లు లెక్క. ఒక స్త్రీ తన మెడలోని హారాన్ని అది తన మెడలోనే ఉన్నట్లు మరచి, ఎక్కడో వెదికి తిరిగి చివరకు హారము తన మెడలోనే ఉన్నట్లు గ్రహించినట్లు, మనము వెదికే శాంతి, సుఖము నిరంతరం మన స్వరూపంగానే ఉంది. మన స్వభావానికి విరుద్ధమైన అహంభావన వల్లనే శాంతి అనుభవంలో లేకుండా పోతోంది. దీపము వెలిగించకుండా చీకటి పోవాలి అని ఆరాటపడినట్లు, వ్యక్తిభావనను పోగొట్టుకోకుండా శాంతిని, మోక్షాన్ని కోరుకుంటున్నాం! ఉన్నదంతా లోపలే ఉంది, బయట ఏమీ లేదు అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. శాంతి మన స్వరూపమే! దానికి ఉన్న ముసుగును తొలగించాలి. శాంతి మన స్వస్థితి, అశాంతి మన మనోసృష్టి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# శ్రీ నాన్న సద్గురు దేవులకు ప్రేమతో...

అయ్యా నాన్నగారు తమరు ఎక్కడ ఉన్నారు? ఏది మీ బోసి నవ్వులు. శ్రీరమణ భాస్కరలోనే చుసుకోవాలా! తమ భక్తుల ఏ మనస్సు తలుపు తెరిచినా మీ తలంపే కదా! మీ ఘన చరిత్ర తనివితీరా చూస్తున్నాము. భూపతిరాజ వంశాన సూర్యనారాయణ రాజు, రాజాయమ్మల నోములపంటగా కన్న మాణిక్యముగా కొమ్మర గ్రామములో జన్మించారు. చిరుప్రాయములోనే అమ్మమ్మతో ఋషికేష్‌లో చిన్మయానంద సరస్వతి స్వామిగారి ఆశీర్వాదం పొంది 1963 సం॥ శ్రీరమణులు మిమ్ములను స్వప్నదర్శనములో ముద్దులతో మురిపించారా! 1984 సం॥లోనే సద్గురు స్థానాన్ని అలంకరించి "జిన్నూరు వాసం శిరసానమామి శ్రీనాన్నదేవం మనసా స్మరామి" అని తమ భక్తులు ఆనందంలో మైమరచి పాడుకొనేలా చేస్తున్నారా! జిన్నూరును గోకులంగా తిరువాయూరుగా మార్చిన తండ్రి. భక్తులు కనురెప్పలు వేయకుండా మిమ్ములను ఎందుకు చూస్తున్నారు. అవి పండు వెన్నెల గనులు కదా! మీ కళ్ళు జ్ఞానకాంతితో మమ్ములను తన్మయత్వంలో ముంచేస్తున్నాయి కదా! మీ నయనం మధురం, మీ రూపమంతా మధురం, రూపం లేని పరమాత్మ రూపం ధరించి మాముందు నడయాడారా! అది ఒక పల్లె, ఒక పట్నమా, ఒక దేశమా! ప్రపంచమంతా భక్తులు మీ పాదాలచెంతకు వ్రాలారు కదా! ఏమిటి ఆ శక్తి? శ్రీరమణుల అనుగ్రహం కాక మరి ఏమిటి? కోట్లాది భక్తుల మానసాన్ని సమ్మోహితం చేసి మీరు ఉత్తుంగ తరంగమై విశ్వరూపం ఎత్తి భక్తులను ఉర్రూతలు ఊగించారు కదా! పోస్టాఫీసు మీటింగులతో ప్రారంభించి ఆది అంతం లేని అనంతమైన మీ ప్రవచనాలు 3 సం॥ల వయస్సుగలవాడు తన తల్లితో "అమ్మా శ్రీనాన్నగారి స్వీట్ వాయిస్ ఆనందంగా విని, హాయిగా పరవశించి గాఢనిద్రలోనికి వెళ్ళిపోతాను అమ్మా!" అన్నాడు కదా! మీ బోధల సారాంశం "ఐ సెన్‌సే నాన్సెన్స్" అన్నారు. భక్తితో అక్షరమణమాల చదువుకుంటూ మీ సుమధుర రూపం చూసుకొని పగలు రాత్రి స్వప్నంలో కూడా పాడుకుంటున్నాము కదా! పెంకుటిల్లు అరుగులో మీ అమృత బోధ ఎలా మర్చిపోగలం. అప్పల బాధలతో సతమతమైన భక్తులు, ఉద్యోగస్తులకు మెలకువలను చెప్పి ఆ బాధలోంచి బయటపడవేసి సిరిసంపదలు ఒసగే చిన్మయ రూపులు కదా! ఆయా క్షేత్రాలలో ఆయా క్షేత్ర పాలకులు మీకు దర్శనం కలిగించి ఆశీర్వదించారు కదా! లండన్‌లో "చైల్డ్ ఆఫ్ భగవాన్" అని రోజరు కొనియాడారు కదా! కాలజ్ఞానం చెప్పి కాలాతీత స్థితిలో ఉన్నారా! మీ అవతార పరిసమాప్తి స్థితిలో వైకుంఠ ఏకాదశిలో వైకుంఠ లోకానికి ఏతెంచారా? అక్కడ నుంచి శ్రీ నారాయణునిగా తమ భక్తుల యోగక్షేమాలు చూస్తున్నారా! నిజానికి తమరు హృదయవాసే కదా! పిలిస్తే పలికే దైవం మీరు. మీ భక్తులు నాన్నగారు, నాన్నగారు అంటే ఏమి ఏమి అని అడిగి అడిగిన వరాలను ఇస్తున్నారు కదా! జైజై శ్రీనాన్నగారు, జైజై శ్రీగురుమహరాజ్ అంటూ భక్తుల జయజయ నినాదాలతో దివ్యసమాధికి ఏతెంచారు కదా! శ్రీనాన్న శరణాగతి పారిజాతమా జయ మంగళం మీకు సర్వేస్వరా అనుకొంటున్నాము ఆ సమయంలో తమ భక్తుల కన్నీటి అమృతధారల సంఘటనలు మరువలేము. మా హృదయాలలో ఉన్న శ్రీనాన్నగురుదేవా! చిత్తగించండి స్వామీ. ఇట్లు మీ చరణదాసుడు

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**